మోదుగ విస్తర్లకు తగ్గని ఆదరణ

- నేటికీ మోదుగ విస్తర్లను వినియోగిస్తున్న గిరిపుత్రులు
- జీర్ణశక్తికి మంచిదంటున్న గిరిజనులు

బుట్టాయగూడెం: కాలానికంటే వేగంగా నేటి కంప్యూటర్ యుగంలో మానవుడు ప్రకృతి నుంచి లభించే ప్రసాదాలకు క్రమక్రమంగా దూరమవుతున్నాడు. భూ తల్లి అందించే సహజ వనరులను అందిపుచ్చుకునే అవకాశం లేక పర్యావరణ సమతుల్యతను దెబ్బతీసే వాటివైపు అడుగులు వేస్తూ ప్రమాదాలను కొనితెచ్చుకుంటున్నారు. అభివృద్ధి పేరుతో బందీగా మారిన మానవులు కాలగర్భంలో తనకున్న కళలు, అభిరుచులను దారబోస్తూ ఉత్తిచేత్తో కాలం వెళ్లబుచ్చుతున్నారు. ముఖ్యంగా విందు భోజనాలు చేయడానికి, శుభకార్యాలకు ఒకనాడు అడ్డాకు విస్తర్లను వినియోగించేవారు. అది ఎంతో ఆరోగ్యకరమైనప్పటికీ నేడు ప్రకృతిమాత ప్రసాదించిన విస్తర్లను వదిలిపెట్టి డిస్పోజిబుల్ వస్తువులవైపు పరుగులు పెడుతున్నారు. దీని కారణంగా అనేక అనారోగ్య సమస్యలను కూడా తెచ్చి పెట్టుకుంటున్నారు. అయితే ప్రస్తుతం ప్రభుత్వం ప్లాస్టిక్‌ను నిషేదించిన తరుణంలో మళ్లీ మోదుగ విస్తర్లకు ఆదరణ పెరిగే అవకాశం కనిపిస్తుంది.

గిరిసీమల్లో తగ్గని ఆదరణ

నేటి స్పీడ్ యుగంలో మోదుగ చెట్టు ఆకులతో తయారు చేసిన విస్తర్లను పక్కన పెట్టి రంగురంగుల విస్తర్లవైపు అందరూ మొగ్గుచూపినా పశ్చిమ ఏజెన్సీ ప్రాంతంలోని గిరిపల్లెల్లో ఆదివాసీ కొండరెడ్డి గిరిజనులు నేటికీ మోదుగ ఆకుల విస్తర్లనే వినియోగిస్తున్నారు. ఆయా గ్రామాల్లో పండుగలు, శుభకార్యాలు జరిగితే అడవికి వెళ్లి మోదుగ చెట్ల నుంచి ఆకులను సేకరించి ఇళ్లకు తీసుకువచ్చి మహిళలు విస్తర్లను తయారు చేసిన అనంతరం వాటిని శుభకార్యాల్లో వినియోగిస్తున్నారు.




రేపల్లెలో మోదుగాకు విస్తర్లు కుడుతున్న గిరిజన మహిళ, అడవి నుంచి మోదుగాకును సేకరించి తీసుకువస్తున్న దృశ్యం →

మోదుగాకు ప్రత్యేకత

ఆయుర్వేదం ప్రకారం పచ్చని ఆకుల్లో భోజనం చేయడం కళ్లకు, మనసుకు ఇంపును ఇవ్వడంతో పాటు జీర్ణశక్తి కూడా పెరుగుతుందనేది పూర్వీకుల నమ్మకం. అడవిలో లభించే పచ్చని ఆకులపై ఎలాంటి రసాయనాల ప్రభావం ఉండదు. సహజసిద్ధంగా అడవిలో లభించే మోదుగాకు అదే కోవకు చెందినది ఈ ఆకు ఎక్కువ కాలం నిల్వ ఉంటుంది. అలాగే శుభ్రం చేయడానికి కూడా కూడా వీలుగా ఉంటుంది. దీనితో మోదుగాకు విస్తర్లలోనే భోజనాలు చేస్తున్నారు. గతంలో గిరిజనులు అడవి నుంచి తీసుకువచ్చిన మోదుగాకులతో విస్తర్లను తయారు చేసి సంతల్లో విక్రయించేవారు. ప్లాస్టిక్ వినియోగం పెరగడంతో వారి విక్రయాలు నిలిచిపోయాయి. ప్రస్తుతం ప్రభుత్వం ప్లాస్టిక్‌ను నిషేదించడంతో మళ్లీ మోదుగాకుల విస్తర్ల విక్రయాలకు అవకాశం లభిస్తుందని గిరిజనులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఎన్నో ఔషధ గుణాలు..



ఆకుల్లో భోజనం చేయడం వలన ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని శాస్త్రాలు చెప్తున్నాయి. మేము ఎక్కువగా శుభకార్యాల్లో, పండుగ సమయాల్లో మోదుగ, టేకు ఆకుల్లో భోజనం చేస్తుంటాం. ఆకుల్లో ఉండే ఔషధ గుణాలు శరీరానికి ఎంతో మేలు చేస్తాయని మా పెద్దలు చెప్తూ ఉండేవారు. అప్పటి నుంచి ఇప్పటికీ మేము మోదుగు ఆకుల్లోనే భోజనం చేస్తున్నాం.

– మడకం వెంకటేష్, గిరిజన యువకుడు, అలివేరు, బుట్టాయగూడెం మండలం

ప్రతి పండుగకూ..



గిరిజన ప్రాంతంలో బాట పండుగ, మామిడికాయ పండుగ, పప్పు పండుగ, భూదేవి పండుగతోపాటు పెళ్లిళ్లు, ఇతర శుభకార్యాలకు తప్పనిసరిగా మోదుగాకుల్లోనే భోజనాలు చేయడం ఆనవాయితీ. ఇంట్లో ఏ శుభకార్యం ఉన్నా, గ్రామంలో పండుగ జరుగుతున్నా మహిళలు అడవికి వెళ్లి మోదుగాకులు సేకరించి విస్తర్లు తయారు చేస్తారు. అనంతరం అందరూ ఆ విస్తర్లలో సహపంక్తి భోజనం చేస్తాం.

– కారం వాసు, గిరిజనుడు, ఎర్రాయిగూడెం, బుట్టాయగూడెం మండలం

క్లుప్తంగా

బర్లమడుగులో కార్డన్ సెర్చ్



బర్లమడుగు గ్రామంలో తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

కుక్కునూరు: మండలంలో బర్లమడుగు గ్రామంలో గురువారం కుక్కునూరు పోలీసులు కార్డన్ సెర్చ్ నిర్వహించారు. సీఐ వి.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఎస్సై ఎస్.రామకృష్ణ, సిబ్బంది గ్రామంలో ప్రతి ఇంటిని తనిఖీ చేశారు. అనుమానాస్పద వ్యక్తులపై ఆరా తీశారు. తనిఖీల్లో భాగంగా సరైన పత్రాలు లేని నాలుగు ద్విచక్ర వాహనాలను సీజ్ చేశారు. అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందస్తు చర్యల్లో భాగంగా గ్రామాల్లో కార్డెన్ సెర్చ్ నిర్వహించినట్లు సీఐ శ్రీనివాసరావు తెలిపారు.

వైభవంగా వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణం



ప్రత్యేక పూజలు అందుకున్న గోవిందమాంబ సమేత వీరబ్రహ్మేంద్రస్వామి

టి.నరసాపురం: శ్రీమద్విరాట్ పోతులూరు వీరబ్రహ్మేంద్రస్వామి, గోవిందమాంబల కల్యాణోత్సవాన్ని గురువారం కొత్తగూడెంలో అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు, సామూహిక వ్రతాలు నిర్వహించారు. స్వామి అమ్మవార్లను పురవీధుల్లో ఊరేగిస్తూ గ్రామోత్సవం జరిపారు. ఆలయం వద్ద భక్తులకు అన్నసమారాధన చేశారు.

విజయదుర్గమ్మకు పల్లకీ సేవ



విజయదుర్గ అమ్మవారిని పల్లకీపై గ్రామోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం: పట్టణంలో విజయదుర్గ అమ్మవారికి పల్లకీ సేవ నిర్వహించారు. పట్టణ ప్రధాన వీధుల్లో అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని పల్లకీలో ఉంచి ఆలయ కమిటీ సభ్యులు, ఉత్సవ కమిటీ సభ్యులు, భక్తులు గ్రామోత్సవం జరిపారు. ఆలయ శాశ్వత కమిటీ ఛైర్మన్ మారిశెట్టి రాధాకృష్ణ మాట్లాడుతూ పౌర్ణమి తిథిని పురస్కరించుకుని పల్లకీ సేవ నిర్వహించినట్లు వివరించారు. తొలుత పూజా కార్యక్రమాలు ఆలయ అర్చకులు సుదర్శనం వేణుగోపాలచార్యులు నిర్వహించినట్లు తెలిపారు. రామిశెట్టి శ్రీనివాసరావు, గుడిమెట్ల యుగంధర్, యర్రం ఉదయ్‌కుమార్, వీరవల్లి శ్రీనివాసరావు, జల్లేపల్లి శివకృష్ణ, మహిళా కమిటీ సభ్యులు, పాల్గొన్నారు.

వేధింపుల కేసు నమోదు

జంగారెడ్డిగూడెం: భర్త తనను వేధిస్తున్నాడని భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై జ్యోతిబాస్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పంగిడిగూడెం గ్రామానికి చెందిన మాండ్రు జ్యోతికి అదే గ్రామానికి చెందిన నాగార్జునతో 14 ఏళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఇద్దరు సంతానం. చెడు వ్యసనాలకు బానిసైన నాగార్జున గత కొంతకాలంగా జ్యోతిని మానసికంగా, శారీరికంగా వేధిస్తున్నాడు. ఈ నేపథ్యంలో ఈ నెల 15న నాగార్జున జ్యోతితో గొడవ పడి తీవ్రంగా కొట్టడంతో గాయపడిన ఆమెను కుటుంబసభ్యులు జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రికి తరలించారు. జ్యోతి ఫిర్యాదుతో వేధింపుల కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

స్ట్రాంగ్ రూమ్ తనిఖీ

దెందులూరు: సీసీకెమెరాలను, వీడియోఫుటేజ్‌లను ప్రతి రోజూ మూడు సార్లు పోలీస్ భద్రతా సిబ్బంది తనిఖీ చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్, దెందులూరు నియోజకవర్గ రిటర్నింగ్ ఆఫీసర్ బీ.లావణ్యవేణి ఆదేశించారు. గురువారం దెందులూరు నియోజకవర్గ పోలింగ్ బ్యాలెట్ బాక్సుల స్ట్రాంగ్ రూమ్‌ను తనిఖీ చేశారు. మూడంచెల భద్రతను పరిశీలించారు. రిజిస్టర్లు తనిఖీ చేసి పర్యవేక్షణాధికారిగా సంతకం చేశారు. కౌంటింగ్ వరకు మూడంచెల భద్రతా వ్యవస్థ, విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేయాలని పోలీస్ అధికారులకు ఆదేశాలిచ్చారు.

యువత వ్యక్తిత్వ వికాసం అభివృద్ధి చేసుకోవాలి

ఏలూరు (ఆర్ఆర్‌పేట): యువత వ్యక్తిత్వ వికాసం అభివృద్ధి చేసుకోవాలని సెట్‌వెల్ ముఖ్య కార్యనిర్వహణాధికారి ఎండీహెచ్ మెహరాజ్ పిలుపునిచ్చారు. గురువారం స్థానిక ప్రభుత్వ ఐటీఐలో సెట్‌వెల్ ఆధ్వర్యంలో విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసం, కెరీర్ గైడెన్స్‌పై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కెరీర్ కౌన్సిలర్, నేషనల్ కెరీర్ సర్వీస్ జిల్లా కోఆర్డినేటర్ జీ ప్రవీణ్ కృష్ణ, వొకేషనల్ గైడెన్స్ కోర్సు సీఈఓ వీ. వరలక్ష్మి మాట్లాడుతూ ఐటీఐ విద్యార్థులు స్కిల్ వర్క్ బాగా నేర్చుకుని స్వయం ఉపాధి పొందుతూ అనేక మంది నిరుద్యోగులకు ఉపాధి కల్పించాలని సూచించారు.

అదనపు గదుల నిర్మాణ పనుల పరిశీలన



మున్సిపల్ కార్యాలయ ప్రాంగణంలో అదనపు గదుల నిర్మాణాన్ని పరిశీలిస్తున్న ఛైర్‌పర్సన్ లక్ష్మి

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెం మున్సిపల్ కార్యాలయ ప్రాంగణంలో నిర్మిస్తున్న అదనపు గదుల నిర్మాణ పనులను గురువారం మున్సిపల్ ఛైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పట్టణంలో రోజురోజుకు పెరుగుతున్న జనాభాకు పరిపాలన, సేవలకు సంబంధించి సిబ్బంది విధులు నిర్వహించేందుకు గాను అదనపు గదుల నిర్మాణాలు చేపట్టడం జరిగిందన్నారు. వివిధ పనులపై కార్యాలయానికి వచ్చే ప్రజలకు విశ్రాంతి, వెయింటింగ్ హాల్, సిబ్బందికి గదులు కేటాయించడం జరుగుతుందన్నారు. కాగా నిర్మాణ పనులు పరిశీలించిన ఛైర్‌పర్సన్ నాణ్యతా ప్రమాణాలను పాటిస్తూ నిర్మాణాన్ని పటిష్ఠంగా చేపట్టాలని గుత్తేదారునికి సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌ఛైర్మన్ ముప్పిడి వీరాంజనేయులు, మున్సిపల్ కమిషనర్ ఎస్.నరేంద్రకుమార్, కౌన్సిలర్ సుంకు సురేష్, బత్తిన చిన్న, వైఎస్సార్‌సీపీ నాయకులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

బాల్యవివాహాలు చట్టరీత్యా నేరం



సమావేశంలో మాట్లాడుతున్న సీడీపీవో పి.బ్యూల

కామవరపుకోట: బాల్యవివాహాలు చట్టరీత్యా నేరమని జంగారెడ్డిగూడెం సీడీపీవో పి.బ్యూల అన్నారు. గురువారం మండలంలో స్థానిక వీరభద్ర కాలనీలో మాసిక మహోత్సవ కార్యక్రమాల్లో భాగంగా అంగన్‌వాడీ కేంద్రంలో గ్రామస్తులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వివాహ వయసు రాకుండా బాల్యవివాహాలు చేయడం వలన పుట్టబోయే బిడ్డ అనారోగ్యంతో బలహీనంగా ఉంటారన్నారు. మహిళలకు, యుక్తవయసు బాలికలకు, వారి తల్లిదండ్రులకు ఋతుక్రమం సమయంలో ఉండే అపోహలు, ఆరోగ్యం, పరిశుభ్రత తదితర వాటి గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కామవరపుకోట అంగన్‌వాడీ ఏరియా సూపర్‌వైజర్లు బీవీల్ మంగాదేవి, ఎన్.వీరకుమారి, ఏఎన్‌ఎం ప్రియదర్శిని, మహిళా కానిస్టేబుల్ రాధ, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

క్రీస్తు బోధనలు అనుసరణీయం



పాత చింతలపూడి చర్చిలో ప్రార్థనలు చేస్తున్న సీఎస్ఐ బిషప్ తంటేపైడి జాన్ కొర్నేలియస్

చింతలపూడి: యేసుక్రీస్తు బోధనలు ప్రతి ఒక్కరూ పాటించి దేవుని మార్గంలో నడవాలని సీఎస్ఐ బిషప్ తంటేపైడి జాన్ కొర్నేలియస్ బోధించారు. కృష్ణా, గోదావరి అధ్యక్ష ఖండం చర్చ్ ఆఫ్ సౌత్ ఇండియా చర్చి పాస్టర్ నివాస గృహాన్ని గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్రీస్తు మరణించడం ద్వారా లోకానికి రక్షణ భాగ్యాన్ని ప్రసాదించారని అన్నారు. క్రైస్తవ వాక్యంలోని దివ్య సందేశాలను భక్తులు గ్రహించి పరివర్తనతో ముందుకు సాగాలని అన్నారు. చర్చి నిర్మాణానికి పాటుపడ్డ సంఘ పెద్దలను అభినందించారు. కార్యక్రమంలో సంఘ కాపరి కాళంగా గేవిడ్‌కుమార్, పాస్టర్లు, డీనరీ ఛైర్మన్లు, కౌన్సిల్ మెంబర్లు పాల్గొన్నారు. చర్చి పాస్టర్ నివాస గృహం ప్రారంభోత్సవానికి క్రైస్తవ భక్తులు పెద్ద ఎత్తున హాజరయ్యారు.

త్వరలో విర్డ్ సేవలను విస్తరిస్తాం

ఆస్పత్రి ట్రస్ట్ ఛైర్మన్ సుధాకరరావు వెల్లడి



దివ్యాంగుడికి కృత్రిమ అవయవాన్ని అందజేస్తున్న గుప్తా

ద్వారకాతిరుమల: విర్డ్ హాస్పిటల్లో జనరల్ సర్జరి, ఈఎన్‌టీలో ఆరోగ్యశ్రీ సేవలను త్వరలో రోగులకు అందుబాటులోకి తెస్తామని హాస్పిటల్ ట్రస్ట్ ఛైర్మన్ ఎస్వీ సుధాకరరావు తెలిపారు. స్థానిక విర్డ్‌లో ఛైర్మన్ సుధాకరరావు అధ్యక్షతన గురువారం ఆస్పత్రి ట్రస్ట్ బోర్డు సమావేశం జరిగింది. ఈ సందర్భంగా 23 మంది దివ్యాంగులకు కాలిపర్స్, అలాగే ప్రమాదవశాత్తు కాళ్లు పోగొట్టుకున్న వారికి అత్యాధునిక కృత్రిమ అవయవాలను ఛైర్మన్ సుధాకరరావు, వైస్ ఛైర్మన్ వేగేశ్న ఆనందరాజు, ట్రస్ట్ సభ్యులు ఐవీఆర్ సుధాకరరావు, వి.నారాయణమూర్తి, ఎంఎం గుప్తా, చెలికాని రాజమోహనరావు, కేఎస్ఎస్ వంశీ, శ్రీవారి దేవస్థానం ఈవో వేంద్ర త్రినాధరావు అందజేశారు. గుప్తా ఫౌండేషన్ వారి సహకారంతో ఈ కాలిపర్స్‌ను అందజేసినట్టు ఈ సందర్భంగా సుధాకరరావు తెలిపారు. కార్యక్రమంలో ఆస్పత్రి వైద్యులు భవ్యాచంద్, హమీద్, బాలాజీ, విహారి, పీవీ నాగేంద్రబాబు, సింధు, గాయత్రి, ఏవో ఉదయ శ్రీ తదితరులు పాల్గొన్నారు.

నైపుణ్యాల మెరుగుకు సమ్మర్ క్యాంపులు దోహదం



సమ్మర్ క్యాంపులో పాల్గొన్న విద్యార్థులు, నిర్వాహకులు

ఏలూరు (టూటౌన్): విద్యార్థుల్లో నైపుణ్యాలను మెరుగుపరిచేందుకు వేసవి శిక్షణ శిబిరాలు దోహదపడతాయని ఐద్వా జిల్లా అధ్యక్షురాలు పి.హైమావతి, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు వి.ఠాగూర్ రాజా అన్నారు. విద్యార్థినీ, విద్యార్థులకు విద్యా, విజ్ఞానం, వినోదం అందించే లక్ష్యంతో హేలాపురి చిల్డ్రన్స్ క్లబ్ వేసవి శిక్షణా శిబిరాలు నిర్వహిస్తుందని తెలిపారు. జిల్లా గ్రంథాలయం, బాలల గ్రంథాలయం, జింగిల్ బెల్ స్కూల్ తదితర ప్రాంతాల్లో నిర్వహిస్తున్న వేసవి శిక్షణా శిబిరాలను గురువారం వారు సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సమ్మర్ క్యాంపుల్లో విద్యార్థులకు చిత్రలేఖనం, సంగీతం, డ్యాన్స్, ఆడపిల్లలకు గుడ్ టచ్, బాడ్ టచ్, సెల్ఫ్ ట్రిక్స్ నేర్పుతున్నట్లు తెలిపారు. స్వాతంత్ర సమరయోధులు జాతీయ నాయకులు, సంఘ సంస్కర్తల జీవిత విశేషాలు తెలియజేస్తున్నట్టు వివరించారు. చిల్డ్రన్స్ క్లబ్ కార్యదర్శి పి.దుర్గాప్రసాద్, క్యాంప్ నిర్వాహకులు జి.శారద, సీహెచ్ రాజేశ్వరి, యు.దుర్గా, పవన్ తదితరులు రిసోర్స్‌పర్సన్లుగా బోధిస్తున్నట్లు చెప్పారు.

వరి విత్తనాలు అందుబాటులో ఉంచాలి



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయ సహాయకులు షేక్ హబీబ్ బాషా

వేలేరుపాడు: అన్ని రకాల వరి విత్తనాలు అందుబాటులో ఉండేలా చూసుకోవాలని జిల్లా వ్యవసాయ సహాయకులు షేక్ హబీబ్ బాషా అధికారులను ఆదేశించారు. మండలంలోని మేడేపల్లి ఆర్‌బీకేను గురువారం ఆయన సందర్శించారు. వేలేరుపాడు, కుక్కునూరు గ్రామ వ్యవసాయ సహాయకులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమీక్షలో గ్రామ సహాయకులకు ఏజెన్సీ రైతులకు అన్ని రకాల వరి విత్తనాలు అందుబాటులో ఉండేలా చూసుకోవాలని తెలియజేశారు. అలాగే ఎరువులు పురుగుమందులు విచక్షణా రహితంగా వాడకుండా రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. ఈ సమావేశంలో డివిజన్ అధికారి పీజీ బుజ్జిబాబు, వేలేరుపాడు, కుక్కునూరు మండల వ్యవసాయ అధికారులు పాల్గొన్నారు.

దాసరోజుకు సన్మానం



గవరవరం కంచి కామాక్షి పీఠంలో దాసరోజు శ్రీనివాసరావు దంపతులను సన్మానిస్తున్న దృశ్యం

కొయ్యలగూడెం: బ్రహ్మశ్రీ దాసరోజు శ్రీనివాసరావు దంపతులకు విశ్వబ్రాహ్మణ సంక్షేమ సంఘం గురువారం సన్మాన కార్యక్రమం నిర్వహించింది. విశ్వకర్మ లెజెండరీ జాతీయ పురస్కారానికి శ్రీనివాసరావు ఎంపికైన నేపథ్యాన గవరవరంలోని శ్రీ కంచి కామాక్షి పీఠంలో ఆయన్ను ఘనంగా సత్కరించారు. హైదరాబాద్‌కు చెందిన విశ్వకర్మ నాలెడ్జి సెంటర్ 8వ వార్షికోత్సవ సందర్భంగా సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఈ నెల 26వ తేదీ శ్రీనివాసరావు అవార్డు అందుకోనున్నారు. దీనిని పురస్కరించుకుని విశ్వకర్మ అసోసియేషన్ అధ్యక్షుడు దార్ల రాంబాబు ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. జ్యోతిష్య శాస్త్రంలో శ్రీనివాస్ డాక్టరేట్ అందుకుని ఏజెన్సీ మెట్ట ప్రాంతానికి పేరు తీసుకువచ్చారన్నారు. కార్యక్రమంలో సంఘ కార్యదర్శి జవాది శ్రీనివాస్, పెద్దోజు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ మేడవరపు విజయలక్ష్మి, జెడ్పీటీసీ రమేష్



సమావేశానికి హాజరైన మండలంలోని వివిధ శాఖల అధికారులు

కామవరపుకోట: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని ఎంపీపీ మేడవరపు విజయలక్ష్మి అన్నారు. గురువారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ మేడవరపు విజయలక్ష్మి అధ్యక్షతన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశంలో మండలంలో జరిగిన అభివృద్ధి కార్యక్రమాలపై వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మేడవరపు విజయలక్ష్మి మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుధ్య పనులు చేపట్టాలని, మంచినీరు సరఫరా చేసే ట్యాంకులను శుభ్రపరచాలని, అలాగే గ్రామాల్లో తాగునీటి ఎద్దడి లేకుండా ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని అధికారులకు సూచించారు. మండలంలోని కొన్ని ప్రాంతాల్లో రహదారులకు అడ్డంగా విద్యుత్ స్తంభాలు ఉన్నాయని, వాటి వల్ల రాకపోకలకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, వాటిని పక్కకు మార్చాలని విద్యుత్ శాఖ సిబ్బందిని ఆమె కోరారు. జెడ్పీటీసీ కడిమి రమేష్ మాట్లాడుతూ మండలంలో కొన్ని రహదారులు గోతులతో ప్రయాణానికి అసౌకర్యంగా ఉన్నాయని మరమ్మతులు చేపట్టాలని ఆర్అండ్‌బీ అధికారులను కోరారు. త్వరలో రహదారుల మరమ్మతులు చేపట్టడంతో పాటు కామవరపుకోట మండలం కళ్ళచెరువు, లింగపాలెం మండలం ఆసన్నగూడెం రెండు మండలాలు కలుపుతూ సరిహద్దు గల గుండేరుపై వంతెన నిర్మాణానికి రూ.5 కోట్ల 50 లక్షల ప్రతిపాదనలతో ప్రభుత్వానికి నివేదించినట్లు, ప్రభుత్వ అనుమతుల రాగానే నిర్మాణం చేపడతామని ఆర్అండ్‌బీ అధికారులు తెలిపారు. ప్రస్తుతం ఈ వంతెనపై రాకపోకలకు రూ.20 లక్షలతో తాత్కాలిక రహదారి నిర్మాణం చేపడుతున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ తమ్మిశెట్టి గిరిజ, ఎంపీడీవో స్వర్ణభారతి, వివిధ శాఖల మండల అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

పోలవరంలో తగ్గని ఎన్నికల వేడి

- ఓటింగ్ సరళిపై విశ్లేషించుకుంటున్న నాయకులు
- ఎన్నికల్లో విజయంపై జోరుగా పందేలు

బుట్టాయగూడెం: ఓటింగ్ ప్రక్రియ ముగిసి పది రోజులు దాటినా పోలవరం నియోజకవర్గంలోని గ్రామాల్లో ఇంకా ఎన్నికల వేడి తగ్గలేదు. ఫలితాలపై రోజురోజుకూ ఉత్కంఠ పెరుగుతుంది. ఓట్ల లెక్కింపునకు మరో పది రోజులు ఉండడంతో ఎవరి భవితవ్యం ఎలా ఉండబోతుందోనని అంతా లెక్కలు వేసుకుంటున్నారు. గత ఎన్నికల్లో కంటే ఈసారి ఎన్నికల్లో పోలింగ్ శాతం పెరగడంతో తమకు అనుకూలంగా ఫలితాలు వస్తాయని ఎవరికి వారు అంచనాలు వేసుకుంటున్నారు. అలాగే ఓటింగ్ సరళిపై నాయకులు విశ్లేషణ చేసుకుంటున్నారు. ఇదిలా ఉండగా గెలుపు ఓటమిలపై లక్షల్లో బెట్టింగ్‌లు జరుగుతున్నాయి. నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో కూడా ఎక్కడికక్కడ లక్షల్లో బెట్టింగ్‌లు కాస్తున్నారు. ఫలితాల సమయంలో తేడాలు రాకుండా మధ్యవర్తుల సమక్షంలో అగ్రిమెంట్లు కూడా రాసుకుంటున్నట్లు సమాచారం. ఇదిలా ఉండగా రాష్ట్రంలో ఏ పార్టీ అధికార పగ్గాలు చేపడుతుందనే అంశంపై కూడా గిరిజన ప్రాంతంలో జోరుగా బెట్టింగ్‌లు సాగుతున్నాయి. కూటమి గెలుస్తుందని కొందరు, వైఎస్సార్ సీపీ గెలుస్తుందని కొందరు ఒకటికి నాలుగురెట్లు పందేలు కాస్తున్నారు.

శాంతిభద్రతల పరిరక్షణకు సహకరించాలి



రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహిస్తున్న డీఎస్పీ ఎస్.సురేష్‌కుమార్‌రెడ్డి

పోలవరం రూరల్: శాంతిభద్రతల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని పోలవరం డీఎస్పీ ఎస్.సురేష్‌కుమార్ రెడ్డి అన్నారు. గురువారం పోలవరం పోలీస్‌స్టేషన్ ఆవరణలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ ఎన్నికల కోడ్, 144 సెక్షన్‌తో పాటు పోలీస్ సెక్షన్ 30 కూడా అమలులో ఉందన్నారు. ఈ నేపథ్యంలో ఈ నెల 4వ తేదీ ఓట్ల లెక్కింపు ప్రక్రియతో పాటు ఫలితాలు అనంతరం మరికొద్ది రోజులు మండలంలో శాంతి భద్రతలు పరిరక్షణకు 144 సెక్షన్‌తో పాటు పోలీస్ సెక్షన్ 30 కొనసాగుతుందన్నారు. కావున ఏ ప్రాంతంలో కూడా గుంపులుగా ఉండటం, అనుమతులు లేని సభలు, సమావేశాలు, విజయోత్సవ ర్యాలీలు నిర్వహించడం చేయరాదన్నారు. బాణసంచా నిషేధించామన్నారు. ఉద్దేశ్యపూర్వకంగా ర్యాలీలు చేసి ప్రత్యర్థులను రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయడం, సోషల్ మీడియాలో వదంతులు వ్యాపింప చేయడం నేరమన్నారు. సాధారణ జనజీవనానికి ఎటువంటి విఘాతం కలిగించినా చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. కావున రాజకీయ పక్షాలు, వారి అభిమానులు శాంతి భద్రతల పరిరక్షణకు సహకరించాలని కోరారు. సీఐ జి.మధుబాబు, ఎస్సై పవన్‌కుమార్, సిబ్బంది, వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యుత్ కోతల వేళలివే..

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెం విద్యుత్ డివిజన్ పరిధిలోని పోలవరం మండలంలోని పోలవరం ప్రాజెక్టు విద్యుత్ ఉత్పత్తి కేంద్రం నుంచి 400 కేవీ లైన్ గుడ్డిగూడెం 400 కేవీ సబ్‌స్టేషన్ వరకు ట్రాన్స్‌మిషన్ కొత్త లైను ఏర్పాటు పనులు జరుగుతున్న కారణంగా పోలవరం, దేవరగొంది సబ్‌స్టేషన్ల పరిధిలోని గ్రామాలకు మూడు రోజుల పాటు విద్యుత్ సరఫరాలో అంతరాయాలు ఏర్పడుతాయని ఏపీఈపీడీసీఎల్ ఈఈ పి.రాధాకృష్ణ తెలిపారు. ఈ నెల 24, 25, 26 తేదీల్లో ఉదయం 7.30 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని తెలిపారు. కావున పోలవరం మండలం, చుట్టుపక్కల గ్రామాల విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

బల్లమ్మ తల్లి ఆలయ వార్షికోత్సవం

టి.నరసాపురం: బల్లమ్మ తల్లి ఆలయ 11వ వార్షికోత్సవాన్ని గురువారం అల్లంచర్ల కొత్తగూడెంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి జలాభిషేకం జరిపి కుంకుమ పూజలు చేశారు. అనంతరం ఆలయం వద్ద అన్నసమారాధన నిర్వహించారు. కేతవరం, గుడ్లపల్లి, రాజుపోతేపల్లి గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఘనంగా 63వ చండీహోమం



నూకాలమ్మ ఆలయంలో చండీహోమం నిర్వహిస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం: పట్టణంలోని నూకాలమ్మ అమ్మవారి ఆలయంలో పౌర్ణమిని పురస్కరించుకుని చండీహోమం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయ ఛైర్మన్ డాక్టర్ రాజాన సత్యనారాయణ ఆధ్వర్యంలో అర్చకులు మనోజ్ శర్మ పూజా కార్యక్రమాలు నిర్వహించారు. తొలుత అమ్మవారికి విశేష పూజలు జరిపారు. అనంతరం ఆలయ యాగశాలలో మోతుకూరి రత్నగిరిరావు, లక్ష్మీరాణి దంపతులు, చిటికెన హరికృష్ణ, ఝాన్సీ దంపతులు, పిండి దుర్గ కుటుంబసభ్యులు ఉభయధారులుగా వ్యవహరించగా, చండీహోమం నిర్వహించారు. కార్యక్రమంలో తిప్పాభట్ల రామకృష్ణ మాస్టర్, ఆలయ కమిటీ సభ్యులు, నూకాంబిక సేవా బృందం సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.